ల్యాబ్‌డబ్‌కు ఆయువునిచ్చేలా..

- పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు ఉచితం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సౌకర్యాలు
- ప్రతి ల్యాబ్‌లో అధునాతన పరికరాలు

కాట్రేనికోన: సర్కారు వైద్యానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయువు పోసింది.. ఆ ఫలమే నేటికీ పేదలకు అందుతోంది.. గ్రామీణ ప్రాంతాలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ధ్యేయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు రక్త పరీక్షలు చేసే అధునాతన యంత్రాలను అందించి ల్యాబ్‌లను తీర్చిదిద్దారు. మైక్రో బయాలజీ, పెథాలజీ రక్త పరీక్షల ల్యాబ్‌లను ఆధునీకరించడంతో ప్రైవేట్ ల్యాబ్‌లలో వేలాది రూపాయల ఖర్చు అయ్యే రక్త పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోని ల్యాబ్‌ల్లో పేదలకు ఉచితంగా అందిస్తున్నారు. కాట్రేనికోన, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో కాట్రేనికోన, పల్లంకుర్రు, కొత్తలంక, గొల్లవిల్లి, అల్లవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ముమ్మిడివరం, టి.కొత్తపల్లి, తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రక్త పరీక్షలకు అవసరమైన అధునాతన యంత్రాలను సమకూర్చి రోజూ వందలాది మంది పేదలకు రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్‌ల్లో సరాసరి 80 మందికి రక్త పరీక్షలు చేస్తున్నారు. పల్లంకుర్రు పీహెచ్‌సీలో ల్యాబ్‌కు అవసరమైన యంత్రాలు, టెక్నీషియన్ అందుబాటులో ఉన్నా పీహెచ్‌సీలో ల్యాబ్‌కు అవసరమైన రూమ్ లేక నిరుపయోగంగా ఉంది. పల్లంకుర్రులో ఆసుపత్రి నిర్మాణానికి నిధులున్నా స్థలం లేక నిర్మాణ పనులు చేపట్టలేదు. ఇక్కడ చిన్నపాటి గదిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.



కాట్రేనికోన పీహెచ్‌సీ ల్యాబ్‌లో గత ప్రభుత్వంలో సమకూర్చిన యంత్రాలతో రక్త పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట

గత ప్రభుత్వం ముందు చూపుతో పీహెచ్‌సీ ల్యాబ్‌ల్లో రక్త పరీక్షల కోసం అనేక యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో హెమటాలజీ సెల్ కౌంటర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ రేటైన్ ఎనలైజర్, ఎలక్ట్రోలైటర్ ఎనలైజర్, మైక్రోస్కోప్, ట్రూ నాట్ టీబీ టెస్ట్ ఎనలైజర్ వంటి యంత్రాలను సమకూర్చింది. పీహెచ్‌సీల పరిధిలోని ల్యాబ్‌ల్లో సుమారు 63 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రోగుల నుంచి రూ.వేలు తీసుకుని చేస్తున్న రక్త పరీక్షలను ఇక్కడ ఉచితంగా చేస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వీటితో పాటు పూర్తి ఆటోమేటెడ్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్ వంటి అధునాతన యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఈ మెషీన్‌తో 100 టెస్ట్‌లను ఒకే గంటలో చేసేందుకు వీలుంటుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన యంత్రాలను సమకూర్చడంతో ప్రైవేట్ ల్యాబ్‌ల దోపిడీకి అడ్డుకట్ట వేసింది. దీంతో రోగులకు ఎంతో మేలు ఉపశమనం కలిగింది.

> **అన్ని పరీక్షలూ ఉచితం**
>
> ప్రభుత్వ ఆసుపత్రిల్లో అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో రక్త పరీక్షలకు రూ.వేలు ఖర్చు చేయాల్సి వచ్చేది. అందువల్ల సర్కారు వైద్యానికే అందరం వెళ్తున్నాం.
>
> -పాలెపు లక్ష్మి, పల్లం

నిరుపేదలకు ఆసరాగా..

వైఎస్సార్ సీపీ రాక ముందు ప్రభుత్వ ఆసుపత్రుల్లో హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, మలేరియా, డెంగీ వంటి పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా వ్యాధి నిర్ధారణకు అవసరమైన ల్యాబ్‌ల్లో టీబీ, లివర్, లిఫిడ్ ప్రొఫైల్, యూరిక్ యాసిడ్, హెచ్ఐవీ, హెచ్‌సీవి, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, హెమటాలజీ తదితర సుమారు 63 రకాల పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్‌లను అప్పట్లో ఆధునీకరించడం వల్ల నిరుపేద రోగులకు ఆసరాగా మారింది.



రోగులకు చేస్తున్న 63 రకాల పరీక్షల బోర్డు

క్లుప్తంగా

ఘనంగా లక్ష తులసి పూజ

ఐ.పోలవరం: మురమళ్లలోని **వీరేశ్వరస్వామి** ఆలయ క్షేత్ర పాలకుడు లక్ష్మీన**రసింహస్వామికి** గురువారం లక్ష తులసి **పూజ అత్యంత** వైభవంగా జరిగింది. కొమాన**పల్లి గ్రామానికి** చెందిన పానంకిపల్లి సూర్యనారాయణాచార్యులు, సుదర్శనం దశరథ**రామాచార్యులు** ఆధ్వర్యంలో పలువురు పండితులతో ఈ వేడుక నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి, లక్ష తులసి పూజ చేశారు. మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్ర నామ పారాయణ, లలిత పారాయణ, తిరుప్పావై జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్సీల పరామర్శ



సత్యవతీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, సూర్యనారాయణరావు

అల్లవరం: కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు సతీమణి సత్యవతీదేవి మృతికి ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం వ్యక్తం చేశారు. సతీ వియోగంతో బాధపడుతున్న సుబ్రహ్మణ్యంరాజును ఆయన నివాసంలో పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీల వెంట చిట్టూరి పెదబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జల్లి శ్రీను, ఉప సర్పంచ్ ముమ్మిడివరపు సుధీర్ తదితరులు ఉన్నారు.

స్వీట్ మేస్త్రికి ఆర్థిక సాయం



స్వీట్ మేస్త్రికి ఆర్థిక సహాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కాట్రేనికోన: గచ్చకాయలపోరలో అనారోగ్యంతో బాధపడుతున్న స్వీట్ మేస్త్రీ అంగాని వీరబాబుకు స్వీట్ తయారీ యూనియన్ నాయకులు సుమారు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంగని వీరబాబు వృత్తి రీత్యా స్వీట్ తయారీ మేస్త్రి. ఆయన కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్వీట్ పని చేయవద్దని వైద్యులు చెప్పడంతో ఇంటికి పరిమితమయ్యాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరబాబు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న స్వీట్ మేస్త్రిలు వాతాడి సత్తిబాబు, ఓలేటి సత్తిబాబులు యూనియన్ తరఫున స్వీట్ కార్మికుల నుంచి ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు. ఇలా మొత్తం రూ.50 వేలను వీరబాబుకు తల్లి దండ్రుల సమక్షంలో అందజేశారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, మంకీ క్యాప్‌లు పంపిణీ చేస్తున్న వైద్యులు మోహిత్, సాయి

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలోని చినచంద్రపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నారులకు మార్చి 12న ఒకటి కాబోతున్న నూతన జంట, డాక్టర్లు మోహిత్, సాయి శీతలు వంద సేవా కార్యక్రమాల్లో భాగంగా మంకీ క్యాప్‌లు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. వీరి వివాహం సమాజానికి ఆదర్శంగా ఉండాలని ఉద్దేశంతో వంద సేవా కార్యక్రమాలు డిసెంబర్ 6 నుంచి మార్చి 12 వరకూ వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు శ్యామ్ జాదుగర్, ఉప్పుగంటి శ్రీధర్ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: ఐ.పోలవరం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం గృహ, ఆక్వా చెరువులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఈఈ మోకా రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, జి.వేమవరం, జి.మూలపొలం, కేశనకుర్రుపాలెం, తిళ్లకుప్ప గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని అన్నారు.

దుబాయ్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి..

తాళ్లరేవు: బతుకు తెరువు కోసం దుబాయ్‌కు వెళ్లిన ఓ మహిళ అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతుండగా స్థానిక నాయకుల కృషితో క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. ఆ వివరాల్లోకి వెళితే.. పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి పద్మ కొన్ని రోజుల క్రితం దుబాయ్ వెళ్లింది. ఆమెను పంపిన ఏజెంట్ పి.ఏడుకొండలు సరైన పత్రాలు సమర్పించక పోవడంతో దేశం కాని దేశంలో అనేక ఇబ్బందులు పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్థానిక నాయకులు జక్కల ప్రసాద్, వడ్డమూరి సతీష్ తదితరులకు తెలియజేయడంతో వారు మంత్రి నారా లోకేష్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన లోకేష్ సంబంధిత అధికారులతో మాట్లాడి తనను క్షేమంగా తిరిగి స్వదేశానికి తీసుకు వచ్చారని బాధితురాలు పద్మ తెలిపింది.

కరెంట్ చార్జీల బాదుడుపై...
నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట

అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి ర్యాలీ

అమలాపురం టౌన్: విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాటు కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అమలాపురంలో శుక్రవారం ఉదయం ర్యాలీ, నిరసన అనంతరం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రాల అందజేత వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోరుబాటలో ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు అమలాపురం హైస్కూల్ సెంటర్ నుంచి కిలోమీటరు దూరానికి పైగా ఉన్న ఈదరపల్లిలోని ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయానికి ర్యాలీగా తరలి వెళ్లనున్నట్లు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులి నాని తెలిపారు. ర్యాలీ ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయానికి చేరుకున్నాక అక్కడ కొంత సేపు నిరసన, తర్వాత డీఈఈకి వినతి పత్రం సమర్పణ ఉంటుందని తెలిపారు. కూటమి సర్కారు కరెంట్ చార్జీల బాదుడును వ్యతిరేకిస్తూ ఈ వినతి పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులు అమలాపురం హైస్కూల్ సెంటరుకు చేరుకోవాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

నేడు నిరసన ర్యాలీ

ముమ్మిడివరం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డివిరిచిందని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక దొరక్క ఏడు నెలలుగా భవన నిర్మాణ రంగం చతికిల పడిందని, మరోపక్క రైతన్నకు ఇస్తానన్న పెట్టుబడి సాయం అందించక అప్పులు ఊబిలో కార్మిక, కర్షకులు ఉన్నారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో సూపర్ వంచన చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మోపిన విద్యుత్ చార్జీల భారం మరింత కుంగదీసిందన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచనని చంద్రబాబు ఎన్నికల్లో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారని, ఇప్పుడు ఆరు నెలల తిరగకుండానే చార్జీల భారం ప్రజలపై మోపారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టడానికి విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ నిరసన పోరుబాటకు సిద్ధమైందన్నారు. తొలుత ముమ్మిడివరం కాశివాని తూము సెంటర్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేస్తామన్నారు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

ఐ.పోలవరంలో..

ఐ.పోలవరం: పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం ఉదయం ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ జరిగే ధర్నాను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అంతా తిప్పి కొట్టాలన్నారు.

పార్టీ శ్రేణులూ తరలిరండి



మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడంపై శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాటను అమలాపురం హైస్కూల్ సెంటర్ వద్ద చేపడతామని మాజీ ఎంపీ చింతా అనురాధ గురువారం తెలిపారు. అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు హైస్కూల్ వచ్చి అక్కడి నుంచి ఈదరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారంపై అధికారులకు వినతిపత్రం ఇస్తామని, వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని అనురాధ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ పిలుపునిచ్చారు.

29న సత్యనారాయణస్వామి కల్యాణం

అమలాపురం టౌన్: అమలాపురం లోకాస్సమస్తా సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఈ నెల 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు లోక కల్యాణార్థం అనంతలక్ష్మీ సత్యవతీ దేవి సమేత వీర వెంకట సత్యనారాయణమూర్తి దివ్య కల్యాణ మహోత్సవం జరుగనుంది. ఆ ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్ గౌడ్ పర్యవేక్షణలో ఆ దేవ దేవుని దివ్య కల్యాణం నిర్వహించనున్నట్లు ఆధ్మాత్మిక సంస్థ తెలిపింది. కల్యాణం పీటలపై కూర్చునదలిచిన భక్తులు తమ పేర్లను ఈ నెల 28వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని కుమార్‌శంకర్ గౌడ్ సూచించారు. స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులందరికీ ప్రవేశం ఉచితమపాకపరు. ఏ విధమైన పూజా రుసుములు, హుండీలు ఉండవని, అందరూ ఆహ్వానితులేనని ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకు కల్యాణం నిర్వాహణ సంస్థ 98496 07052 ఫోన్ నంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



వ్యాయామం, ధ్యానం గురించి అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్ట్

అల్లవరం: రోజూ క్రమం తప్పకుండా 15 నిమిషాలు వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి రుగ్మతల నుంచి ఉపశమనం లభిస్తుందని నిమ్స్ ఆస్పత్రికి చెందిన ఫిజియోథెరపిస్టులు రమేష్, సంతోష్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే విధానంపై కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫిజియెథెరపిస్టులు మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి ప్రధాన కారణం మొబైల్ అని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ప్రశాంత వాతావరణంలో ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు శంకరప్రసాద్, శిరీష, వీరబాబు, మృదుల తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

యానాం: స్థానిక గోపాల్‌నగర్ పరిధి గాంధీ నగర్ మూడో క్రాస్ వీధిలో పేకాట క్లబ్‌పై గురువారం పోలీసులు దాడి చేసి, ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ముదునూరి కృష్ణంరాజు, మల్లిపూడి వెంకటేశ్వరరావు, వేగేశ్న వెంకట సత్యనారాయణరాజు, కోడూరి ప్రకాశరావు, కాజులూరి అచ్చిరెడ్డి, ముదునూరి మురళీకృష్ణవర్మ, డి.సత్యనారాయణలను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.12 వేలు, 6 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై ఎం.ఇలంగో తెలిపారు.

వీరబాల్ దివస్ జాతీయ దినోత్సవం

అమలాపురం రూరల్: బండారులంక ప్రాథమిక పాఠశాలలో బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశిన ఫణింద్ర ఆధ్వర్యంలో వీరబాల్ దివస్ జాతీయ దినోత్సవం నిర్వహించారు. సిక్కుల 10వ గురువు గురు గోవింద్ సింగ్ చివరి కుమారులు బాబా జోరవర్సింగ్, బాబా ఫతేసింగ్‌ల ఆత్మ బలిదానం జ్ఞాపకార్థంగా వారి చిత్రపటాలకు విద్యార్థులు నివాళులు అర్పించారు.

లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయం

తాళ్లరేవు: జాతీయ స్థాయి యోగా పోటీలకు వెళ్లేందుకు విద్యార్థి వాతాడి విష్ణు కల్యాణ్‌రామ్‌కు తాళ్లరేవు లయన్స్ క్లబ్ ప్రతినిధులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన కల్యాణ్‌రామ్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రూ.6 వేల సాయం చేశారు. ప్రతినిధులు వినోద్, బి.శ్రీనివాసరెడ్డి, నున్న దత్తు, పొన్నాడ పేరయ్యరాజు, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శం



క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్

యానాం: క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. గురువారం స్థానిక ఫెర్రీ రోడ్డులోని గాజుల ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత సమాజానికి ఏసుక్రీస్తు బోధనలు అవసరమన్నారు. అనంతరం సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ రెవరెండ్ బీహెచ్‌వీ మూర్తిరాజు క్రిస్మస్ సందేశాన్ని అందించారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఉప్పలగుప్తం: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. హెచ్ఎం లంకా రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రదర్శనను ఎంఈఓ సత్తి సత్యకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

యానాం: యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రంచే గురువారం యానాం బ్లాక్ లెవిల్ స్పోర్ట్స్ మీట్–2024లో భాగంగా స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, సైక్లింగ్ తదితర ఆటల పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా యువజన అధికారి గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సీహెచ్ కృష్ణ సుధాకర్, అధ్యాపకులు ఆనంద్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లలో సీపీఐ పోరాట ఫలితాలెన్నో..



ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో సీపీఐ జెండా ఎగురవేసి ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

అమలాపురం టౌన్: సీపీఐ శతాబ్ది ఉత్సవాలు అమలాపురం పట్టణంలోని పలు కార్మిక కూడళ్లలో ఓ పండగ వాతావరణంలో జరిగాయి. ఇందులో పాల్గొన్న పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు మాట్లాడుతూ వందేళ్లలో పార్టీ ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించిన ఫలితాలు ఎన్నో ఉన్నాయన్నారు. గురువారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకూ పలు కార్మిక కూడళ్లలో సత్తిబాబు పార్టీ జెండాలను ఆవిష్కరించి పార్టీ వందేళ్ల వైభవాన్ని వివరించారు. పట్టణంలోని వర్కర్స్ కాలనీ, ఆర్టీసీ బస్ స్టేషన్ ఏరియా, చింతపల్లి కృష్ణమూర్తి స్మారక స్తూపం వద్ద, ఆంజనేయ స్వామి సెంటరు, కలశం సెంటర్లలో కార్మిక నాయకులు అరుణ పతాకాలను ఎగురవేసి మిఠాయిలు పంచారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు నిమ్మకాయల శ్రీనివాసరావు, కేవీవీ సత్యనారాయణ, కురసా నాగేశ్వరరావు, మోకా శ్రీనివాసరావు, కాళ్ల భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు రంగా



అమలాపురంలో వంగవీటి రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాపునాడు నాయకులు



విలసవిల్లిలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు

ఉప్పలగుప్తం: పోరాట యోధుడు వంగవీటి మోహన రంగా అని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మాజీ ఎమ్మెల్యే రంగా వర్ధంతిని విలసవిల్లిలో ఆమె అధ్యక్షతన నిర్వహించారు. రంగా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సాల ఏసు, నాని, రామకృష్ణ పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: కాపు నేత వంగవీటి మోహనరంగా వర్ధంతిని స్థానిక మహిపాల వీధిలో కాపు నాయకులు నిర్వహించారు. రంగా చిత్రపటానికి కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ పూల మాలలు వేశారు. కాపునాడు సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి మూర్తి, నాయకులు దూడల ఫణి, పప్పొప్పుల తనీష్, గారపాటి బాలాజీ, కర్రి శ్రీను, గుత్రాల రమేష్, ఆకుల ఈశ్వరరావులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేశారు. పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన వద్ద రంగా విగ్రహానికి పార్టీ నాయకులు పూల మాలలు వేశారు. పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కోశాధికారి సుగ్గు ప్రసాద్, పట్టణ కార్యదర్శులు పేరి శర్మ, మొల్లేటి వెంకటేశ్వరరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణ కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

యానాం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం, జనవిజ్ఞాన వేదిక యానాం శాఖ ఉపాధ్యక్షుడు దంగేటి త్రిమూర్తులు అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులచే మూడో రోజు ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ను ప్రోగ్రామ్ ఆఫీసర్ జయవీరన్ ఆహ్వానంపై జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పర్యావరణం పాడైతే మానవ జీవనం దుర్లభంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఎన్‌వీ రమణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీఎల్‌పీ రాజు, దాట్ల దేవదానంరాజు, టీచర్ కాశి కరుణ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

అమలాపురం రూరల్: రామచంద్రపురం మండలం వెంకటాయిపాలెంలో శిరోమండనం కేసులో ప్రభుత్వం హైకోర్టులో తక్షణమే క్రాస్ అప్పీల్ వేయాలని బాధితులు, విదసం ప్రతినిధులు కలెక్టర్ మహేష్‌కుమార్ కలసి వినతపత్రం అందజేశారు. అట్రాసిటీ కేసులో నిందితులను కాపాడే అధికారులపై సెక్షన్–4 ప్రకారం చర్యలు తీసుకోవాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు గురువారం కోరారు. కార్యక్రమంలో రేవు తిరుపతి రావు, గుబ్బల శ్రీనివాస రావు, వెంటపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీగా ఇందిరాదేవి



ఈఓపీఆర్డీ ఇందిరాదేవిని అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తాళ్లరేవు: మండల ఈఓపీఆర్డీగా సీహెచ్ ఇందిరాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లాడి భైరవమూర్తి బదిలీపై వెళ్లడంతో ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా తాళ్లరేవు పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ వ్యవహరిస్తున్నారు. కాజులూరు మండలంలో పనిచేస్తూ సెలవులో ఉన్న ఇందిరాదేవిని ఈఓపీఆర్డీగా నియమించడంతో శంకరనారాయణ నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఆమెను పంచాయతీ కార్యదర్శులు వీజేవీ రమణ, ప్రసాద్, రామరాజు, శ్రీనివాసరావు, జ్యోతిసుధ తదితరులు అభినందించారు.

వాహన దొంగ అరెస్ట్



తస్కరించిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న షబ్బీర్ అలీ (సీసీ కెమెరా దృశ్యం)

అమలాపురం టౌన్: అమలాపురం నల్ల వంతెన సమీపంలో బూరగాయల లక్ష్మీ నరసింహరావు తన ద్విచక్ర వాహనాన్ని ఓ షాపు వద్ద నిలిపి పక్కకు వెళ్లగానే ఓ అగంతకుడు దర్జాగా చోరీ చేశాడు. ఈ నెల 23న జరిగిన ఈ చోరీపై అందిన ఫిర్యాదుతో పట్టణ పోలీసులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేశారు. ఈ మేరకు జనుపల్లెకు చెందిన అత్తర్ షబ్బీర్ అలీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పి.వీరబాబు తెలిపారు.

గోశాలలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లరేవు: రైతుల పశు సంరక్షణ కోసం ప్రభుత్వం నిర్మిస్తున్న గోశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. గురువారం పటవల పంచాయతీలో నిర్మించే గోశాలలకు ఆమె స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, భజన సత్తిబాబు, బోనం శ్రీనివాస్, మేడిశెట్టి శివ, పులగుర్తి సతీష్ టెక్నికల్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.